WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, సెప్టెంబర్ 23, 2025



# మీ ఆశీర్వాదం కావాలి..

- నేనేమి మనులు, మాణిక్యాలు అడగడం లేదు
- మేడారానికి జాతీయ హోదా కల్పించాలి
- కిషన్ రెడ్డి, బండి సంజయ్ అందుకు కృషి చేయాలి
- జాతర ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటుదాం..
- వెయ్యేళ్లు శాశ్వతంగా ఉండేలా గ్రానైట్ తో నిర్మిద్దాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, ములుగు :** రెండేళ్ల ఒక్కసారి జరిగే మహా జాతరతో పాటు.. ఏడాది పొడుగునా మేడారంలో వనదేవతలైన సమ్మక్క–సారలమ్మ గద్దెలను దర్శించుకునేందుకు అనుగుణంగా మేడారం అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం శ్రీకారం చుట్టారు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు మేడారం చేరుకున్న ముఖ్యమంత్రి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. హెలికాప్టర్ ద్వారా మేడారం చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అధికారులు, పూజారులు సాంప్రదాయ నృత్యాలు, డోలు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, ఎంపీ పోరిక బలరాం నాయక్ మేడారం రావడంతో వారికీ రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క, వడ్లూరి లక్ష్మణ్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, ఎస్పీ డాక్టర్ శబరీష్ స్వాగతం పలికారు. తొలుత ముఖ్యమంత్రి, మంత్రులు గద్దెల ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చిరే సారా సమర్పించారు. దీంతో పాటు తన ఎత్తు బంగారం అమ్మవార్లకు సమర్పించారు.

### శాశ్వత ప్రాతిపదికన పనులు..

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మేడారంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని, కేంద్ర ప్రభుత్వం కుంభమేళా తరహాలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసిందన్నారు. మేడారం కీర్తి ప్రపంచానికి చాటాలని, సమ్మక్క– సారలమ్మ వైభవం తరతరాలకు తెలిసే విధంగా అభివృద్ధి జరుగాలన్నారు. సమ్మక్క–సారలమ్మ గద్దెలు రాబోయే వందల సంవత్సరాలకు ఆదర్శంగా నిలవాలి అని, అందుకే ఈ ప్రాంగణంలో సిమెంట్ కట్టడాలకు బదులు రాతి కట్టడాలతో శాశ్వత నిర్మాణాలు చేపడతామని చెప్పారు. నాడు కాకతీయుల కాలంలో రుద్రదేవుడు కట్టించిన రామప్ప ఆలయం ఎనిమిది వందల సంవత్సరాలైనా నిలిచి ఉన్నట్టు ఇక్కడి నిర్మాణాలు వందల ఏళ్లు నిలవాలని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులు 100 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు సూచించామని ఆయన వెల్లడించారు. జనవరి 28 నుండి 31 మధ్య జరిగే మహాజాతర నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మేడారం అభివృద్ధిలో ఆదివాసి సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రణాళికలు ప్రభుత్వం చేస్తోంది కానీ సాంప్రదాయాలు ఆదివాసులవి అని, నిర్మాణం నుంచి సంరక్షణ వరకు ఆదివాసీల భాగస్వామ్యంతోనే కొనసాగిస్తాం అని సీఎం తెలిపారు. పరిశోధకులు, వారసులు, స్థానిక గిరిజన ప్రతినిధులు నిర్మాణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. జాతరను దేశంలోని కుంభమేళాల తరహాలో జాతీయ పండుగగా గుర్తించాలని, కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక నిధులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఉత్తరప్రదేశ్ అయోధ్యకు లభిస్తున్న గుర్తింపు, సహకారం లాగే తెలంగాణ ములుగు అడవుల్లో ఉన్న సమ్మక్క–సారలమ్మ జాతర కూడా దేశ పండుగగా గుర్తింపును పొందాలి అని ఆయన విన్నవించారు. కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన పంచాయతీరాజ్ మంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్క–సారలమ్మ జాతరకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు అని, ఆయన సంకల్పంతో ఈ ప్రాంతం శాశ్వతాభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలతో మేడారం గద్దెల ప్రాంగణం కొత్త అందచందాలతో అలంకరించబడనుందని, రాబోయే జాతర నాటికి యావత్ దేశం, ప్రపంచం నుంచి వచ్చే భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు వేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు ఎంపీలు బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య,ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి,నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర అయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### నిలువెత్తు బంగారం..

మేడారం సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవార్లకు 68 కిలోల నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. మేడారంలో సమ్మక్క– సారలమ్మ గద్దెల సమీపంలో సీఎం తన బరువు ఎత్తు బంగారం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం మంత్రి సీతక్క మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ పూజారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అమ్మవార్ల ఆశీర్వాదాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.















## సీఎం టూర్ సూపర్ సక్సెస్

### ఫలించిన మంత్రి సీతక్క కృషి

**వరంగల్ వాయిస్, ములుగు :** మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టూర్ సూపర్ సక్సెస్ అయింది. స్వయంగా సీఎంను మేడారం తీసుకురావడంలో మంత్రి సీతక్క కృషి ఫలించింది. మేడారం అభివృద్ధి ప్రణాళిక కోసం మొదటి నుంచి పట్టుబట్టిన సీతక్క పూజారులను ఒప్పించడంలో కీలకపాత్ర పోషించారు. సచివాలయంలో వరుస సమీక్షలు, అన్ని శాఖల మధ్య సమన్వయం తీసుకురావడంలో ఆమె సక్సెస్ అయ్యారు. మేడారం అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించిన మొట్టమొదటి సీఎం రేవంత్ రెడ్డి. ఆదివాసి, గిరిజనుల ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి రెండు గంటలకు పైగా మేడారం అభివృద్ధి ప్రణాళికపై ఆయన సమీక్షించారు. పూజారుల అభిప్రాయాలు తెలుసుకున్న సీఎం, మేడారం అభివృద్ధికి ఎన్ని నిధులైన ఖర్చు చేస్తామన్న సీఎం హామీ ఇవ్వడంపై సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మహాజాతరలోపు యజ్ఞంలా పనులు పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేయడంతోపాటు దగ్గరుండి పనులు పూర్తి చేసే బాధ్యతలను మంత్రులు పొంగులేటి, సీతక్కకు అప్పగించారు. సీఎం పర్యటన సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడంపై సీతక్క హర్షం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పర్యటన మేడారం అభివృద్ధికి నాంది పలికిందన్న అభిప్రాయం వ్యక్తమైంది.